

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,77,222లు, బంగారం 650 మిల్లీ గ్రాములు, వెండి 34 గ్రాముల 300 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మణిపూర్ అల్లర్లపై నిరసనలు

- 8లో



విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

- 8లో

న్యూస్‌రీల్

రైలు ప్రమాదంలో అనాథలైన బాలలకు సాయం

- మయూర్‌భంజ్ కలెక్టర్ వినీత్ భరద్వాజ్

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్‌లో జూన్ 2వ తేదీన జరిగిన ట్రిపుల్ రైలు ప్రమాదంలో అనాథలైన బాలలకు మయూర్‌భంజ్ జిల్లా అధికార యంత్రాంగం ఆదుకుంటుందని కలెక్టర్ వినీత్ భరద్వాజ్ తెలియజేశారు. జిల్లాకు చెందిన ఎనిమిది మంది చిన్నారులు రైలు దుర్ఘటనలో అనాథలయ్యారు. వీరందరికీ చదువులు ఇతరేతర ఖర్చుల నిమిత్తం ప్రతినెల రూ.4,000 చొప్పున ఆర్థిక సాయం అందుతుందని వెల్లడించారు. మంగళవారం ఒక్కొక్కరికీ రూ.4,000 చెక్కులను అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెక్కులు అందించారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండి స్వయం సమృద్ధి సాధించేవరకు ఈ సాయం నిరవధికంగా కొనసాగుతుందన్నారు.

బైక్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

జయపురం: పట్టణంలోని గోకుల్ ఆస్పత్రి సమీపంలో బైక్ దొంగలించిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 6వ తేదీన గోకుల్ ఆస్పత్రి సమీపంలోని ఆశారాంనగర్‌లో బిజయ షాడంగి తన ఇంటిలో బైక్‌ను ఉంచాడు. ఇది గమనించిన నిందితుడు తలుపుల తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించి, బైక్ దొంగలించుకొని తీసుకెళ్లిపోయాడు. దీంతో బిజయ షాడంగి జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు అధికారిగా ఏఎస్‌ఐ బిష్ణు మడకామిని నియమించారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు ఆకాశ గదబాగా వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

జయపురం: శ్రావణ మాసం కావడంతో సోమవారం గుప్తేశ్వర్ వెళ్లి పూజలు నిర్వహించి తిరిగి వస్తున్న సమయంలో కారు, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒక మహిళతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందిన వెంటనే రామగిరి పోలీసు పంటి పోలీసు అధికారి బలరాం హికాక తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గాయపడినవారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారు కలహండి జిల్లా భవానీపట్న నుంచి గుప్తేశ్వర్‌కు వచ్చారని, అతివేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

బాబోయ్ భల్లూకం

- పాఠశాలలోకి 6 ఎలుగుబంట్లు



పాఠశాల ఆవరణలో తిరుగుతున్న భల్లూకం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దోహన గ్రామంలోని సదాశివ ఉన్నత పాఠశాలలోకి 6 ఎలుగుబంట్లు సోమవారం రాత్రి ప్రవేశించాయి. మంగళవారం ఉదయం స్కూల్‌కి వచ్చిన విద్యార్థులకు ఎలుగుబంట్లు కనిపించడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే ఉపాధ్యాయులు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోగా మూడు ఎలుగుబంట్లు స్కూల్ నుంచి బయటకు వచ్చి అడవి బాట పట్టాయి. మిగతా తల్లి భల్లూకం, మరో రెండు పిల్లలు స్కూల్‌లోనే ఉన్నాయి. దీంతో చేసేదేమి లేక స్కూల్‌కి సెలవు ప్రకటించారు. గత నెల రోజుల్లో మూడు సార్లు ఇలా భల్లూకాలు స్కూల్‌కి వచ్చి వెళ్లాయి. అందువలన అధికారులు భద్రతా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 200 మంది విద్యనభ్యసిస్తున్నారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

- మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన ద్రౌపది ముర్ము
- స్వాగతం పలికిన గవర్నర్, సీఎం



రాజ్ భవన్ మార్గంలో బారులుతీరిన ప్రజలతో కలిసేందుకు కారు దిగి కాలి నడకన వెళ్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ గణేషీ లాల్, సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం సాయంత్రం భువనేశ్వర్ విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సాదరంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రాష్ట్రపతి స్థానిక రాజ్ భవన్‌కు బయల్దేరారు. దారి పొడవునా ఆమెకి స్వాగతం పలికేందుకు ప్రజలు బారులుతీరారు. ప్రజలతో ప్రత్యక్షంగా కలిసేందుకు రాష్ట్రపతి కారు నుంచి దిగి కాలి నడకన కొంత దూరం వెళ్తూ సాధారణ ప్రజానీకాన్ని మురిపించారు.

రాజ్ భవన్‌లో విడిది

మంగళవారం రాత్రి రాజ్ భవన్‌లో విడిది ఏర్పాటు చేశారు. తొలిరోజు పర్యటన కార్యక్రమం ప్రకారం రాష్ట్రపతి వైద్య విద్యార్థుల బృందంతో పరస్పర చర్చా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వీరంతా అతుట్ బంధన్ అనే స్వచ్ఛంద సంస్థ స్పాన్సర్‌తో వైద్య విద్యని అభ్యసిస్తున్న వారు కావడం విశేషం. అనంతరం రాజ్‌భవన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

నేటి కార్యక్రమాలు

రాష్ట్రపతి రెండో రోజు పర్యటన హడావుడిగా సాగుతుంది. బుధవారం కటక్ ఒడిశా హైకోర్టు 75వ వార్షికోత్సవ వేడుకలకు హాజరవుతారు. కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వార్షిక కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తారు. తర్వాత నేషనల్ లా యూనివర్సిటీ ఒడిశా (ఎన్‌ఎల్‌యూఓ) స్నాతకోత్సవంలో ప్రసంగిస్తారు.

రేపటి పర్యటన వివరాలు

గురువారంతో భారత రాష్ట్రపతి 3 రోజుల రాష్ట్ర పర్యటన పూర్తి అవుతుంది. న్యూఢిల్లీ తిరిగి వెళ్లే ముందు రాజ్‌భవన్‌లో ప్రత్యేక బలహీన గిరిజన సమూహాల (పీవీటీజీ) సభ్యులతో ఆమె సంభాషిస్తారు. ఈ కార్యక్రమం తర్వాత ఢిల్లీకి పయనమవుతారు.

విషాదం

- పాముకాటుతో ముగ్గురు బాలలు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో విషపూరిత పాము కాటు మరణాలు కలకలం రేపుతున్నాయి. గత 2 రోజులుగా చోటు చేసుకుంటున్న ఈ విచారకర ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో పాము కాటుతో ముగ్గురు బాలలు మృతి చెందారు. వీరిలో ఇద్దరు దివ్యాంగ సోదరులు ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. దేవ్‌గఢ్ పోలీసు ఠాణా పరిధిలోని జంగలికుదర్ గ్రామంలో ఇంటిలో నేలపై నిద్రపోతున్న ఇద్దరు దివ్యాంగ సోదరులు పాము కాటుకు బలయ్యారు. వీరివురు గౌరంగ దెహూరి (14), సౌభాగ్య దెహూరి (8)గా గుర్తించారు. సత్వర చికిత్స కోసం దేవ్‌గఢ్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటువంటి సంఘటనే మయూర్‌భంజ్ జిల్లాలో చోటు చేసుకుంది. కప్తిపాదా తహసిల్ కతురియా గ్రామంలో ఒక మైనర్ బాలుడు పాముకాటుతో మరణించగా బాలుడి తల్లి పాము కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇంతకు ముందు రెండు రోజుల క్రితమే కెంజొహర్ జిల్లా బరియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిశ్చింత్‌పూర్ గ్రామంలో ఒక ప్రైవేట్ కోచింగ్ సెంటర్ హాస్టల్‌లో విద్యార్థులకు పాము కాటేసింది. ఈ ఘటనలో ముగ్గురు మైనర్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు బాలికలు ఉన్నారు.

మార్గదర్శకాలు జారీ

మూడు రోజుల్లో వరుసగా 3 పాము కాటు మృత్యు సంఘటనలు చోటు చేసుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చలించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో యాంటీ-వెనమ్ మందులను తగినంత నిల్వ ఉంచాలని జిల్లా ప్రధాన వైద్యాధికారులకు (సీడీఎంఓ) ఆదేశించింది. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యాశాఖను ఆదేశించగా, పాఠశాలల్లో పాములు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

అంతిమ కష్టాలు..!



మృతదేహంతో నదిని దాటుతున్న గ్రామస్తులు

కొరాపుట్: జిల్లాలో లక్ష్మీపూర్ సమితి కక్కిరిగుమ్మ సమీపంలోని చరడ గ్రామస్తులకు అంతిమ సంస్కారాలకు కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి, శ్మశానవాటికకు మధ్య నది ఉండడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన మహిళ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేయడానికి నదిని దాటించారు. అంత్యక్రియలు కోసం గ్రామస్తులు నది వద్దకు వెళ్లగా అది భారీ స్థాయిలో ప్రవహిస్తోంది. యువకులు నదిలో దిగి ఒకరి చేయి మరొకరు పట్టుకొని అతికష్టం మీద మృతదేహాన్ని నదిని దాటించి, అంత్యక్రియలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదిపై పాదచారుల వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన డీఆర్‌ఎంగా బజ్వా



హెచ్.ఎస్.బజ్వా

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా హెచ్.ఎస్.బజ్వా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1997 సంవత్సరపు ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) అభ్యర్థి. ఇదివరకు రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (బొగ్గు), రైల్వే బోర్డులో డైరెక్టర్ ట్రాఫిక్ ట్రాన్స్‌పోర్ట్ (జి), నార్తర్న్ రైల్వే చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్, తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు మండలం సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే బిలాస్‌పూర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, ఆహార మరియు ప్రజాపంపిణీ శాఖ జాయింట్ డైరెక్టర్ (మూమెంటు) వంటి పలు హోదాల్లో పనిచేశారు. ఈయన 1991–1995లో చండీగఢ్‌లోని పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. హైస్పీడ్ రైలు వ్యవస్థలో ప్రత్యేక శిక్షణ కోసం కొరియా మరియు జపాన్ సందర్శించారు. సమష్టి కృషితో సమగ్ర అభివృద్ధి సులభతరమవుతుందన్నారు. సరుకు, ప్రయాణికుల సురక్షిత రవాణా కార్యకలాపాల్లో సమర్థత, దక్షత, విశ్వసనీయత సంస్థాగత లక్ష్య సాధనే ధ్యేయంగా సిబ్బంది ఉమ్మడిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రింకేష్ రాయ్‌కు ఘన సన్మానం



రింకేష్ రాయ్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి(డీఆర్‌ఎం) రింకేష్ రాయ్‌కు తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు ఆదరాభిమానాలతో వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా స్థానిక బీజేబీ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆడిటోరియం ప్రాంగణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీమణి శుభ లక్ష్మి జెనాతో కలిసి హాజరయ్యారు. 2021 సంవత్సరం ఏప్రిల్ నెలలో ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారిగా రింకేష్ రాయ్ బాధ్యతలు చేపట్టిన నుంచి నిరవధికంగా శ్రమించి ఖుర్దారోడ్ రైల్వే పరిసరాలకు సరికొత్త రూపురేఖలు దిద్దారు. సిబ్బందికి అధునాతన సౌకర్యాలతో వసతి సదుపాయం, నిరవధిక విద్యుత్, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. అలాగే పలు సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలను చురుకుగా చేపట్టారని శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు అభినందించారు.

నేడు కార్యాలయాలు మూత

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కటక్ పర్యటన దృష్ట్యా ఒడిశా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అభ్యర్థన మేరకు కటక్‌లోని హైకోర్టు ప్రాంతానికి సమీపంలోని అనేక కార్యాలయాలు, బ్యాంకులు మరియు పోస్టాఫీసులు బుధవారం మూసివేయబడతాయి. ఈ మేరకు సెంట్రల్ డివిజన్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

భారీగా గంజాయి స్వాధీనం



అరెస్టు చేసిన నిందితులు, గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 587 కిలోల గంజాయిని సురడా పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి జితేంద్ర కుమార్ మల్లిక్ తెలిపిన సమాచారం మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి ట్రక్కులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న సమయంలో, ముందుగానే సమాచారం అందుకున్న గంజాం జిల్లా సురడా పోలీసులు రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో వాహనాల్లో సోదాలు నిర్వహించారు. అనుమానంతో ఒక ట్రక్కులో సోదాలు నిర్వహించగా 587 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో ట్రక్కుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మరో 280 కిలోల గంజాయి సీజ్

బరంపురం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిలో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 280 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. బరంపురం ఎక్సైజ్ కమిషనర్ రామచంద్ర మహంతి తెలిపిన వివరాలు మేరకు... పాత్రపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో టాటా పికప్ వ్యాన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేశారు.



అరెస్టు చేసిన వ్యక్తి, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితులు

రాయగడ: రామనగుడ సమితి చాకుండా గ్రామంలోని నియంత్రిత బజారు కమిటీ(ఆర్‌ఎంసీ) పత్తి గోడౌన్‌లో కొద్దిరోజుల క్రితం వివిధ విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో సంబంధిత శాఖ అధికారి చిత్తరంజన్ ప్రధాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ బబులా ప్రధాన్ నేతృత్వంలో పోలీసుల బృందం వివిధ ప్రాంతాల్లో దర్యాప్తు నిర్వహించింది. ఈ నేపథ్యంలో చోరీకి సంబంధించి పెదబాబు మండంగిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా చోరీకి గురైన వివిధ వస్తువులు లభించాయి ఈ చోరీకి అతడికి సహకరించిన చిన్న నాగబొంశను కూడా పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

నాటుసారా బట్టీలపై దాడులు



దిగపండి దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

బరంపురం: జిల్లా పోలీసు శాఖ పరిధిలో అక్రమంగా నడుస్తున్న రెండు వేర్వేరు నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం దిగపండి పోలీసుస్టేషన్ పరిధి లుచ్చాపడా గ్రామ శివారులోని మొగలి పొదలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీపై దాడులు నిర్వహించారు. అలాగే కె.నువాగం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారున అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న సారా బట్టీపై దాడి చేశారు. ఈ రెండు దాడుల్లో సుమారు 11,400 లీటర్ల నాటుసారా ధ్వంసం చేయడంతో పాటు మరో 409 లీటర్ల నాటుసారాతో సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



లుచ్చాపడాలో సారా బట్టీపై దాడి చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా దర్యాప్తు

- పేపర్ లీకేజీ అసలు నిందితులను పట్టుకుంటాం
- ఓఎస్‌ఎస్‌సీ ప్రమేయంపై ఆధారాలు లేవు
- వివరాలు వెల్లడించిన బాలాసోర్ ఎస్పీ సాగరిక నాథ్



ఎస్పీ సాగరిక నాథ్

భువనేశ్వర్: ఒడిశా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఓఎస్‌ఎస్‌సీ) నిర్వహించిన జూనియర్ ఇంజినీర్ (సివిల్) మెయిన్ పరీక్ష ప్రశ్నపత్రాల లీక్‌లో దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. ప్రధాన సూత్రధారి మరియు ఇతర నిందితుల కోసం రాష్ట్రేతర ప్రాంతాల్లో గాలింపు కోసం 5 పోలీసు బృందాలను నియమించారు. ప్రధాన పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ రాకెట్‌కు సంబంధించి ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్టు చేశారు. మరి కొంత మందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. మరికొంతమందిని పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని సమాచారం.

రెండు రాష్ట్రాలకు పోలీసు బృందాలు

ప్రశ్నాపత్రం లీక్ ముఠా ప్రధాన సూత్రధారి రాష్ట్రం వెలుపల ఉన్నట్లు సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో 5 పోలీసు బృందాలను రెండు రాష్ట్రాలకు పంపినట్లు బాలాసోర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సాగరిక నాథ్ విలేకరులకు తెలిపారు. ఈ లీకేజీ వ్యవహారంలో ఓఎస్‌ఎస్‌సీ ప్రమేయంకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఈ మొత్తం ముఠాలో రాష్ట్రేతర వ్యక్తులే ఎక్కువగా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఈ కేసులో రాష్ట్రంలో పట్టుబడిన వారు ప్రధాన సూత్రధారుల మధ్యవర్తులు, వారధులుగా వ్యవహరించిన వారు మాత్రమేనని పేర్కొన్నారు. అసలైన నిందితులు పరారీలో ఉన్నారని తెలియజేశారు. వీరి కోసం రాష్ట్రేతర ప్రాంతాల్లో గాలింపు వ్యూహాత్మకంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రధానంగా బీహార్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ వంటి పలు రాష్ట్రాల్లో ఈ రాకెట్ విస్తరించి ఉన్నట్లు భావిస్తున్నారు. నిందితులు అందరినీ అదుపులోకి తీసుకున్న తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

సమాచారం సేకరణ

ప్రశ్నాపత్రం లీకేజీకి సంబంధించిన వ్యూహాత్మక కార్యాచరణపై పట్టుబడిన నిందితుల నుంచి సమగ్ర సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం లీకేజీ చేసినవారి నుంచి కొంతమందికి ఏవిధంగా పేపర్ అందిందనే వివరాలు రాబట్టారు. జేఈ సివిల్ మెయిన్ ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న కొందరు అభ్యర్థులను పేపర్ లేకేజీ చేసినవారు ఏజెంట్ల ద్వారా సంప్రదించారు. వారి దగ్గర ఒక్కో ప్రశ్నపత్రం ధర రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు మాట్లాడుకున్నారు. అనంతరం ఈ మొత్తం చెక్కుల ద్వారా వసూలు చేసి జేఈ సివిల్ ప్రధాన రాత పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను గుట్టుగా అందజేశారు. ఈ వ్యవహారం బాలాసోర్ కేంద్రంగా నిర్వహించారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మొబైల్ ఫోన్లు, సంతకాలు చేసిన ఖాళీ చెక్కులు ముందస్తుగా సేకరించారు. ఈ విచారణ ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక దాఖలు చేయడంతో ఒడిశా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఓఎస్‌ఎస్‌సీ) ఈనెల 16న పరీక్ష నిర్వహించిన జేఈ (సివిల్) ప్రధాన రాత పరీక్ష–2022ని రద్దు చేసినట్లు ఆదివారం ప్రకటించింది.

క్లుప్తంగా

బురదమయంగా మహేంద్రగిరి రోడ్డు



చిత్తడిగా మారిన రోడ్డు

పర్లాకిమిడి: పవిత్రమైన మహేంద్రగిరి పర్వతాలను అధిరోహించడం కష్టంగా మారుతోంది. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోయిపూర్ నుంచి బుర్‌ఖాత్ పాస్ వరకూ 5 కిలోమీటర్ల రోడ్డు బురదమయమైంది. దీంతో యాత్రికులు పర్వతాల మీదకు వాహనాలతో చేరుకోవడం కష్టతరమవుతోంది. అందువలన వెంటనే కోయిపూర్ నుంచి బుర్‌ఖాత్ పాస్‌రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాహిత్య పరిరక్షణలో రచయితల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కిశోర్ చంద్ర ప్రధాన్

జయపురం: ఒడియా భాష, సాహిత్య పరిరక్షణలో రచయితలు, సాహితీపరుల పాత్ర కీలకమైనదని పలువురు వక్తలు అన్నారు. జయపురం సబ్ డివిజన్ కుంద్రా సరస్వతీ శిశుమందిర ప్రాంగణంలో మట్టి లగ్న సాహిత్య పరిషత్ రాష్ట్ర స్థాయి సాహితీ సమావేశం మంగళవారం నిర్వహించారు. మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల మట్టి లగ్న సాహిత్య పరిషత్ శాఖలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించాయి. కవి యజ్ఞేశ్వర పండ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మట్టి లగ్న సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, మల్కన్‌గిరి ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యుడు కిశోర్ చంద్ర ప్రధాన్ మాట్లాడుతూ రచయితలు సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపించే ఉత్తమ సాహిత్యాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాహితీవేత్త కరసుదా పట్నాయిక్, కుంద్ర సరస్వతీ శిశుమందిర ప్రధాన అధ్యాపకుడు భగవాన్ పాఢీ, మట్టి లగ్న సాహిత్య పరిషత్ రాష్ట్ర కార్యదర్శి జయంతి కుమార్ మహలిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఇద్దరు క్రీడాకారిణులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సాధన చేస్తున్న ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ డాక్టర్ పి.శ్రీరాములు చెప్పారు. ఈ మేరకు ఎంపికైన భరిణికాన హారిక, పంపాన మౌనికలు ఈ నెల 29వ తేదీ నుంచి 31 వరకూ చిత్తూరు జిల్లా తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్–19 బాలికల డబుల్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన వారిని స్థానికులు, క్రీడాకారులు అభినందించారు.

విషపూరిత పుట్టగొడుగులు తిని అస్వస్థత

రేగిడి: నాటు పుట్టగొడుగులు అని భావించి పొరపాటున కుక్కపుట్టగొడుగులు తిన్న ఓ కుటుంబం అస్వస్థతకు గురైంది. రేగిడి మండలంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. దేవుపుదల గ్రామానికి చెందిన ఇనుముల హరిబాబు, సుజాత, సరోజిని తదితరులు సోమవారం పొలంపనులకు వెళ్లిన సమయంలో గట్టుపై పుట్టగొడుగులు కనిపించాయి. వాటిని ఇంటికి తీసుకొచ్చి సోమవారం రాత్రి వండుకుని తిన్నారు. అర్ధ రాత్రి నుంచి వాంతులతో పాటు రక్త విరేచనాలు అయి పరిస్థితి విషమించడంతో మిగిలిన కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించగా హుటాహుటినా సంఘటనాస్థలానికి సిబ్బంది చేరుకున్నారు. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు వాహనంలోని ఆత్యాధునిక వస్తుసామగ్రితో ప్రాథమిక వైద్యం చేశారు. బాధితులను ప్రాణాపాయం నుంచి రక్షించి పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులు ఆరోగ్యంగా ఉన్నారని, ఆస్పత్రిలో కోలుకుంటున్నారని స్థానికులు తెలిపారు.

పేకాటలో ఘర్షణ

పార్వతీపురం: పేకాట ఆడుతున్నప్పుడు రేగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. మంగళవారం జరిగిన సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేటకు చెందిన పి.లక్ష్మణ ఇంట్లో వై.విజయ్, ఎస్.హరి, వై.కిరణ్, ఎ.లక్ష్మణ తదితరులు సోమవారం రాత్రి పేకాట ఆడారు. పేకాట ఆడుతున్న వారి పక్కన పెంకి ప్రసాద్ కూర్చున్నాడు. కౌంట్ విషయంలో పేకాట రాయుళ్ల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఎవరింటికి వారు వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ప్రసాద్ చెరువునుంచి ఇంటికి వస్తున్నప్పుడు రాత్రి కాదురా ఇప్పుడు రారా చూసుకుందాం అంటూ వై.విజయ్, ప్రసాద్‌ల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో విజయ్, ప్రసాద్, దావీద్‌లు ఒకరికొకరు కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో ముగ్గురికీ గాయాలు కావడంతో చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మణిపూర్ అల్లర్లపై నిరసనలు



భువనేశ్వర్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యంపై నిరసన తెలుపుతున్న ఆప్ కార్యకర్తలు



భువనేశ్వర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం



జయపురం: బొయిపరిగుడలో ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో నిరసన



జయపురం: నిరసన తెలుపుతున్న కమ్యూనిస్టు పార్టీ సభ్యులు

మణిపూర్ అల్లర్లను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పలు రాజకీయ పార్టీలు ఆరోపించాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు చేపట్టారు. మణిపూర్ హింస విషయంలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



పాఠశాలకు తాళంవేసి గేటు ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- పాఠశాలకు తాళాలు వేసిన వైనం
- పాఠశాల మరమ్మతులు చేయాలని నిరసన

మల్కన్‌గిరి: పాఠశాలకు మరమ్మతులు నిర్వహించకపోవడంతో స్లాబ్ నుంచి వర్షపు నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల ఎన్ఏసీ 12వ వార్డులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గత వారం రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీంతో 12వ వార్డులోని ప్రాథమిక పాఠశాల స్లాబు నుంచి వర్షపు నీరు కారుతూ గదుల్లోకి నీరు చేరుతోంది. దీంతో విద్యార్థులు కూర్చోవడానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళాలు వేశారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల మరమ్మతులు చేపడితేనే విద్యార్థులను మరలా పాఠశాలకు పంపుతామని నిరసన తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న సమితి అభివృద్ధి అధికారి దేవసిస్ బోయి, కోరుకొండ అసిస్టెంట్ ఇంజినీర్ సుకాంత్ కుమార్ స్వాయి, బలిమెల ఐఐసీ ధిరేన్ పట్నాయిక్ పాఠశాల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. వర్షాలు తగ్గిన వెంటనే కలెక్టర్ విశాల్‌సింగ్‌తో మాట్లాడి మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు నిరసన విరమించారు.

'పేపర్ మిల్లును తెరవాలి'



మాట్లాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులు

జయపురం: ముడిసరుకు, కెమికల్స్, బొగ్గు కొరత కారణంగా ఈనెల 14వ తేదీ నుంచి మూసివేసిన పేపర్ మిల్లును వెంటనే తెరవాలని, అలాగే మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు బకాయిలు చెల్లించాలని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జయపురం కార్మిక భవనంలో కమ్యూనిస్టు పార్టీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లు యాజమాన్య తీరును కమ్యూనిస్ట్ నాయకులు దుయ్యబట్టారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు గ్రాట్యుటీ నెల రోజుల్లో చెల్లిస్తామని ఈ ఏడాది మార్చి 17వ తేదీన మిల్లు యాజమాన్యం లిఖితపూర్వకంగా వాగ్దానం చేసిందని, అయితే ఈనెల 21వ తేదీన వారికి కేవలం నాల్గోవంతు మాత్రమే చెల్లించిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రాలో తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ మాదిరిగా గ్రాట్యుటీ వెంటనే చెల్లించకపోతే వడ్డీతో కలపి చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. 2018 నుంచి అనేక మంది కార్మికులు రిటైర్ అయ్యారని, అప్పటి నుంచి గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా మేనేజ్‌మెంట్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం మిల్లును హైదరాబాద్‌కు చెందిన మదర్ అర్థ కంపెనీ హస్తగతం చేసుకున్నా, ఢిల్లీ నుంచి పాత యజమాని ఆదేశాల మేరకే నడుస్తోందని ఆరోపించారు. వెంటనే దీనిపై ప్రభుత్వం కలుగజేసుకొని మిల్లు నడిపేందుకు చర్యలు చేపట్టడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్మోద్ కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల దొంగ అరెస్టు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామం సమీపంలో గల లోటస్ సిమెంట్ బ్రిక్స్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన సెల్‌ఫోన్లు చోరీ చేసిన విశాఖపట్నం జిల్లా తాటిచెట్ల పాలెం ప్రాంతానికి చెందిన పిడుగు మణికంఠను ఎస్సై వీరజనార్దన్ మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సిమెంట్ బ్రిక్స్ పని చేస్తున్న కార్మికులు మంగళవారం ఉదయం రూ.20 వేల విలువైన రెండు సెల్‌ఫోన్‌లను ఆఫీస్ రూమ్‌లో చార్జింగ్ పెట్టి గదికి తాళం వేసి టిఫిన్ చేసేందుకు కొత్తవలస జంక్షన్‌కు వెళ్లారు.తిరిగి వచ్చి చూసేసరికి ఆఫీస్ తాళం విరగొట్టి ఉంది. లోపల చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌లు కనిపించలేదు. దీంతో కార్మికుడు కె.సన్యాసినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరజనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మణికంఠను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

విద్యుత్ వైర్ల చోరీ

గుర్ల: మండలంలోని బెల్లాన పేట వద్ద జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అధికారులు ఉంచిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గుర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు.

మెడికల్ షాపులో చోరీ

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్ సమీపంలో ఉన్న వీరసాయి మెడికల్ షాపులో దొంగలు చొరబడి షట్టర్ విరిచి కౌంటర్‌లో రూ. 8వేలు అపహరించుకుపోయారని షాపు యజమాని జామి గణేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళకు తీవ్ర గాయాలు

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్కూటీపై వెళ్తున్న మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక దాసన్నపేట నుంచి డెంకాడ వెళ్లే రహదారి లో నీలాపు చెరువు సమీపంలో సారిపల్లి అప్పలకొండ స్వగ్రామమైన సారిపల్లికి స్కూటీపై వెళ్లింది. డెంకాడ నుంచి వచ్చిన ఆటో డ్రైవర్ ఆమె పక్క నుంచి హిట్ ఇచ్చాడు. దీంతో ఆమె పక్కకు పడిపోవడంతో రోడ్డుకు తగిలి కాలు విరిగింది. స్థానికులు గమనించి ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేస్‌బాల్ క్రీడాకారిణి శ్వేతాసినీకి సన్మానం



శ్వేతాసినీ శోబోరోను సన్మానిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి బోడోకోలాకోట్ గ్రామానికి చెందిన బేస్‌బాల్ క్రీడాకారిణి శ్వేతాసినీ శోబోరో చైనాలోని హువాంగ్‌ఝూలో జరిగే అంతర్జాతీయ ఆసియన్ గేమ్స్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. దీంతో ఆమెను మంగళవారం సాయంత్రం కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్‌లు సన్మానించారు. గజపతి జిల్లాకు ఆమె గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలుగా సహకారం అందిస్తామని తెలియజేశారు. భువనేశ్వర్‌లోని కళింగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ యూనివర్సిటీలో ఎంఏ సైకాలజీ చదువుతున్న శ్వేతాసినీ శోబోరో తండ్రి ధర్మేంద్ర శోబోరో ఒక గిరిజన రైతు. ఇదివరకు ఆమె రాష్ట్ర, జాతీయ స్థాయిలో నాగ్‌పూర్‌లో 2015లో బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంది. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడంపై జిల్లా ఎస్డీసీ చైర్మన్ మరియం రైతో, గుమ్మా బ్లాక్ స్పెషల్ డవలప్‌మెంట్ కమిషన్ సభ్యుడు పల్లవ్ లిమ్మా, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, గుమ్మా బ్లాక్ చైర్మన్ సునేమీ మండల్ తదితరులు అభినందనలు తెలిపారు.

మునిగుడలో రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌డీపీవో సాహు



రక్తదానం చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసు విభాగం ఆధ్వర్యంలో సింధి భవన్‌లో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. ఎస్‌డీపీవో ఆకాష్ చంద్ర సాహు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసులు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 31 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పోలీసు విభాగం తెలియజేసింది. ప్రజల సంరక్షణతో పాటు ప్రజాసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని సాహు అభినందించారు.

1450 సారా ప్యాకెట్లు స్వాధీనం

పాచిపెంట: అక్రమంగా సారా తరలిస్తున్న నలుగురు వ్యక్తుల నుంచి 1,450 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎసై ఫకృద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలోని పురిటిపెంటకు చెందిన తాడిపైడిరాజు, నగర కృష్ణ లు ఒడిశాలోని పొట్టంగి నుంచి షిఫ్ట్ డిజైర్ కారులో 1000 సారా ప్యాకెట్లు పి.కోనవలస చెక్ పోస్టు మీదుగా గజపతినగరం తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామన్నారు. అలాగే ఒడిశాలోని లావుడి గ్రామానికి చెందిన చిన్ని, మగంటూలు ద్విచక్ర వాహనంపై 450 సారా ప్యాకెట్లు సాలూరు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నలుగురు నిందితులను, వారి వద్ద ఉన్న 1450 సారా ప్యాకెట్లు, షిఫ్ట్ డిజైర్ కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



సారా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుబడిన వాహనాలతో నిందితులు

మడ్డువలసలో ఏనుగుల గుంపు

- పరిశీలించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పంటపొలాల్లో ఏనుగుల గుంపు



ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశానికి వెళ్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మండల పరిధి మడ్డువలస పంటపొలాల్లో ఏనుగుల గుంపు తిష్ఠవేసింది. రెండు రోజులుగా మడ్డువలస ప్రాజెక్టు కింది భాగంలో ఎనిమిది ఏనుగుల గుంపు చెరకు, మొక్కజొన్న, వరి నారుమడులను ధ్వంసం చేసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలిఫెంట్ ట్రాకర్స్ వాటి వెంట ఉంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

ఏనుగులు సంచరిస్తున్న ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు కోరారు. మడ్డువలస పంటపొలాల్లో ఏనుగులు గుంపును వారు మంగళవారం పరిశీలించారు. ఏనుగుల నుంచి ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అటవీశాఖ అధికారులను కోరారు. పంటలకు నష్టం వాటిల్లితే గుర్తించాలని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావిల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, జేసీఎస్ కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, బూరాడ వెంకటరావు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రోత్ సెంటర్‌లో సీసీ రోడ్లు



గ్రోత్ సెంటర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

బొబ్బిలి: నెల్లూరు ఇండస్ట్రియల్ పార్కులో బీటీ రోడ్ల స్థానంలో సీసీ రోడ్లను నిర్మించామని, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కూడా అదే తరహాలో సీసీ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గ్రోత్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనంలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో ఏపీఐఐసీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కాసేపు సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రోత్‌సెంటర్‌లో పరిశ్రమలున్న ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రాంతాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 65 శాతం పరిశ్రమలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.మిగతా 35 శాతం పరిశ్రమలను ప్రారంభించేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

సాలూరులో ఆటోనగర్

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ఎకరన్నర స్థలంలో రూ.4.3 కోట్లతో ఆటోనగర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఖాయిలా పడిన పరిశ్రమలు సైతం పునరిద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూడో రైల్వే లైన్ వస్తున్న కారణంగా సంబంధిత రవాణా ఏర్పాట్లు సిద్ధం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. విజయనగరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, సాలూరు మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, బుడా చైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ యతిరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శిశువుల్లో లోపాలను గుర్తించాలి

- వర్క్‌షాప్‌లో యునిసెఫ్ బృందం



మాట్లాడుతున్న డాక్టర్ రాజన్ శుక్లా

విజయనగరం అర్బన్: బిడ్డలు జన్మించిన నాటి నుంచి మూడేళ్ల లోపలే మెదడు ఎదుగుదల జరుగుతుందని, ఈ వయసులోనే బిడ్డల్లోని లోపాలను కుటుంబసభ్యులే ముందు గుర్తించాలని యునిసెఫ్ ప్రతినిధులు సూచించారు. తొందరగా గుర్తించడం వల్ల వారిలోని లోపాలను సరిదిద్దుకునే అవకాశం కలుగుతుందన్నారు. మూడేళ్ల లోపల వారి వయస్సుకు తగ్గట్టు శిశువులలో అభివృద్ధి జరుగుతుందని ఏ వయసులో ఏమేం మార్పులు జరుగుతాయో తల్లిదండ్రులు, లేదా కుటుంబసభ్యులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల పెంపకం కోసం కుటుంబం, సంఘానికి సాధికారత చేకూర్చడం అనే అంశంపై యునిసెఫ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగం నుంచి వచ్చేసిన వైద్యుల బృందం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఐసీడీఎస్‌ల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. బృందం నాయకుడు డాక్టర్ రాజన్ శుక్లా మాట్లాడుతూ శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే అన్నీ నేర్చుకుంటుందని, అందువల్ల గర్భిణిగా ఉన్నప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, మంచి మాటలు మాట్లాడడం, సంతోషంగా ఉండడం, సంగీతాన్ని వినడం, మంచి ఆహారాన్ని తీసుకోవడం వంటి పనులు చేయాలని చెప్పారు. బిడ్డ జన్మించిన తొలిరోజు నుంచే అభివృద్ధి మొదలవుతూ దినదినం పెరుగుతుందని ఇందులోని మార్పులను తల్లిదండ్రులు, బిడ్డను సాకే ఇతర కుటుంబసభ్యులు గుర్తించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో శిశువుల ప్రారంభ బాల్యం అభివృద్ధి అనే అంశంపై యునిసెఫ్ ప్రతినిధులు డాక్టర్ సలీనా, డాక్టర్ యశస్విని, డాక్టర్ కిరణ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ మరీనా, డాక్టర్ నిరుపమ శిక్షణకు సంబంధించిన పలు అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

సఖి కార్యక్రమానికి ప్రసంశలు

జిల్లాలో అమలు చేస్తున్న సఖి కార్యక్రమానికి యునిసెఫ్ బృందం ప్రశంసలు కురిపించింది. 150 దేశాలు పాల్గొన్న జీ–20 సదస్సులో విజయనగరం నుంచి సఖి కార్యక్రమానికి చోటు దొరకడం అరుదైన సంఘటన అని పేర్కొన్నారు. అంతటి ఘనత సాధించిన జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. సఖి ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రపంచ గుర్తింపు రావడం గొప్ప విషయమని వాటి ఫలితాలను త్వరలో అందుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కరరావు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారి మోహన్‌రావు, మన్యం జిల్లా డీఐఓ జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొని వారి సలహాలను అందించారు.

క్లుప్తంగా

అక్రమ రొయ్యల చెరువులపై దాడులు



రొయ్యల చెరువుల గట్లను తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో మోపసు బందరు రెవెన్యూ పరిధిలో జాలారిపేట వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న రొయ్యల చెరువుల చెరువులపై జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల ప్రకారం ఈ దాడులు చేస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.వెంకట్రావు తెలిపారు. సుమారు 57 ఎకరాల్లో ఉన్న అనధికార చేపల చెరువుల ట్యాంకులను పొక్లెయినర్ల సాయంతో తొలగించారు. కాగా, బంగాళాఖాతంలో నాగావళి కలిసే ప్రాంతంలో అక్రమంగా చెరువులు తవ్వకంవల్ల గ్రామాల్లోకి వరద నీరు వచ్చి ఇబ్బందులు పడుతన్నామని స్థానికులు సామాజిక కార్యకర్తల సహాయంతో కోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన న్యాయస్థానం వెంటనే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ అస్ సర్వే ల్యాండ్‌లో నిర్మించిన రొయ్యల చెరువులను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ సమక్షంలో సుమారు 60 మంది పోలీసు బందోబస్తుతో అక్రమ చెరువుల గట్లను తొలగించారు.

వలంటీర్ సేవాగుణం



నాడు వృథాగా



పైప్, ట్యాప్‌తో కుళాయి

పలాస: పలాస మండలం బొడ్డపాడు కాలనీ వద్ద ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు సంబంధించిన కుళాయి పాడవడంతో తాగునీరు వృథాగా పోయేది. కొంతకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక గ్రామ వలంటీర్ పత్తిరి విజయ్ ముందుకొచ్చాడు. కొత్త పైపుతో పాటు ట్యాప్ ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. వలంటీర్ సేవాగుణాన్ని స్థానికులు అభినందించారు.


ఆవును రక్షించిన సంచార పశువైద్య వాహనం



ప్రాణాలతో బయటపడిన ఆవు

వజ్రపుకొత్తూరు: మూగజీవుల వైద్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న సంచార పశు వైద్య వాహనం ఓ ఆవుకు పునర్జన్మనిచ్చింది. వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామంలో హనుమంతు పూర్ణకు చెందిన ఆవు మంగళవారం విద్యుత్ స్తంభం కోసం తీసిన గుంతలో పడింది. స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అటుగా వెళ్తున్న అంబులెన్స్ సిబ్బంది గమనించి ఆవుకు అత్యవసర చికిత్స అందించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతుబజారులో రూ.50కే కిలో టమాటా



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజల సౌకర్యార్థం కిలో టమాటాను రైతు బజార్లలో రూ.50కే అందజేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని రైతుబజారులో మంగళవారం సబ్సిడీపై టమాటా అందించే కేంద్రాన్ని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలుదారులకు టమాటాలను అందించారు. గత రెండు వారాలుగా దేశ, రాష్ట్రవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.120కు చేరిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటాలను సేకరించి సబ్సిడీపై రూ.50కే కిలో అందించేందుకు రైతు బజారుల్లో విక్రయ కేంద్రాలు ప్రారంభించామన్నారు. తొలివిడతగా జిల్లా కు 5వేల టన్నుల టమాటాలను దిగుమతి చేసుకున్నామని, వీటిని పట్టణ ప్రజల సౌకర్యార్థం అందు బాటులో ఉంచామన్నారు. ప్రజలందరికీ దొరికేలా ఒక్కొక్కరూ కిలో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. త్వరలోనే ఆమదాలవలస, పలాస వంటి పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ వివరించారు.



కొండల మాటున చొరబడి భారత భూభాగాన్ని కబళించేందుకు శత్రువు పన్నాగం. వారిని సరిహద్దు ఆవలకు తరిమికొట్టే బాధ్యత స్వీకరించింది సైన్యం. చుట్టుపక్కల ఉన్న వివిధ రెజిమెంట్ల బలగాలను ఉన్నఫళంగా లక్ష్యం వైపు కదలమని పైనుంచి ఆదేశాలు. ప్రతికూల వాతావరణం, కొండల పైనుంచి గుళ్ల వర్షం కురిపిస్తూ శత్రుమూకల ప్రతిఘటన. అయినా మన జవాన్లు వెరవలేదు.. వెనుకంజ వేయలేదు. కాలినడకన అతి బరువైన ఆయుధాలను మోసుకుంటూ కొందరు.. వాహనాల్లో మరికొందరు రోజుల తరబడి ప్రయాణం చేసి యుద్ధభూమిని చేరుకున్నారు. పైనుంచి కురుస్తున్న గుళ్ల వర్షం నుంచి తమను తాము కాపాడుకుంటూనే బృందాలుగా విడిపోయి హిమాచలాలను అధిరోహించి, శత్రు మూకల పీచమణిచి, టైగర్ హిల్స్ అని పిలిచే కార్గిల్ కొండలపై విజయ పతాకం ఎగురవేశారు. దానికి గుర్తుగానే ఏటా జూలై 26న కార్గిల్ దివస్ జరుపుకుంటున్నాం. భారతీయుల గుండెలు గర్వంతో ఉప్పొంగేలా చేసిన కార్గిల్ యుద్ధంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు జవాన్లు భాగస్వాములయ్యారు. నేడు కార్గిల్ దినోత్సవం సందర్భంగా ఆ యుద్ధవీరుల గుండె చప్పుడు విందాం.

– శ్రీకాకుళం డెస్క్

కార్గిల్ వీరుల కర్తవ్య దీక్ష అచంచలం

- ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్న ఇద్దరు సిక్కోలు సైనికులు
- ఒకరు సింహాచలం.. మరొకరు నీలాచలం
- నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యుద్ధవీరుల గుండెచప్పుడు

పేరు:	చిన్ని సింహాచలం
స్వస్థలం:	లక్కుపురం, బూర్జ మండలం
సైన్యంలో హోదా:	హవల్దార్



● గుళ్ల వర్షం దాటుకుని.. పర్వతాన్ని స్వాధీనం చేసుకుని..

మే 25.. 1999..
1889 లైట్ రెజిమెంట్

శ్రీనగర్ సమీపంలో డ్యూటీలో ఉన్నా. హయ్యర్ కమాండ్ నుంచి సమాచారం వచ్చింది. మరుసటి రోజు ఉదయాన్నే కార్గిల్ వైపు బయల్దేరాలని మూవ్ అయ్యాం. అంతా నడకే. శత్రుమూకలు కొండపైనుంచి గుళ్ల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. మే 31 నాటికి ప్రతికూల పరిస్థితుల్లో టోలోలింగ్ పర్వత ప్రాంతానికి చేరుకున్నాం. వేసవి కాలం అయినా విపరీతమైన చలి.. 421 కేజీల బరువైన 120 ఎంఎం మోర్టార్ గన్‌ను ఐదుగురు సభ్యులం చొప్పున మోసుకుంటూ.. ఫైరింగ్ చేస్తూ ముందుకుసాగాం. 72 గంటలు ఫైరింగ్ ఆపలేదు. గుళ్ల వర్షం కురుస్తూనే ఉంది. బాంబుల మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. సుబేదార్ బన్వర్‌సింగ్ వీరమరణం పొందారు. హవల్దార్ బాబుల్ మిలీ, లాన్స్ నాయక్ వీరయ్య తీవ్రంగా గాయపడ్డారు. దేశరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతూనే ఉన్నాం. జూన్ 12 మొదటి విజయం. ద్రాస్ సెక్టార్‌లోని టోలోలింగ్ పర్వత ప్రాంతం భారత సైన్యం అధీనంలోకి వచ్చింది. ఈ విజయోత్సాహంతో ముందుకు కదిలేందుకు సిద్ధమవుతున్నాం. అదే రోజు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి పెద్ద కుదుపు. కుడిచేతికి తీవ్రగాయాలు.. విపరీతమైన రక్తస్రావం. నా పరిస్థితి గమనించిన ఉన్నతాధికారులు అదే రోజు రాత్రి చికిత్స కోసం హెలికాప్టర్‌లో ఆర్మీ బేస్ ఆస్పత్రికి తరలించారు. ఉదయం శస్త్రచికిత్స జరిగింది. మూడురోజుల తరువాత విమానంలో చండీగఢ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ 12 రోజులు.. అనంతరం విశాఖ ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణికి.. అక్కడ వారం రోజుల చికిత్స జూలై 5న స్వగ్రామానికి వచ్చాను. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం విధుల్లో చేరాను. 1999 ఆగస్టులో కార్గిల్ పోస్టింగ్ ఇచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధి నిర్వహణ అనంతరం మళ్లీ ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2011 వరకు కార్గిల్‌లో సేవలందించాను. ఓపీ స్టార్, ఓపీ విజయ్, ఓపీ రక్షక్, వుండ్ మెడల్స్‌ను ప్రభుత్వం నాకు అందించింది. 2014లో సైన్యం నుంచి హవల్దార్‌గా రిటైర్ అయ్యాను.

'దేశరక్షణ విధులకు యువత మొగ్గు చూపాలి. అందులో ఉండే తృప్తి ఇంకా ఎందులోనూ లభించదు.'



ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్నందుకు సైనికులకు అందజేసిన మెడల్స్





వార్ హీరోస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బుక్‌లెట్‌లో సైనికుల ప్రస్తావన

పేరు:	టొంప నీలాచలం
స్వగ్రామం:	కేసిపురం, పలాస మండలం
సైన్యంలో హోదా:	హవల్దార్



● కదలికల్ని గమనించి.. గుళ్ల వర్షం కురిపించినా..

మే 15.. 1999
28 రాష్ట్రీయ రైఫిల్స్ (జమ్మూ.కాశ్మీర్)

బారాముల్లా ప్రాంతంలో విధుల్లో ఉన్నాను. రాత్రి 12 గంటల సమయంలో మెసేజ్ వచ్చింది. 38 గంటల్లో కార్గిల్ వైపు మూవ్ అవ్వాలని దాని సారాంశం. మే 16 ఉదయం బయల్దేరాం. వాహనాల్లో మా ప్రయాణం. నాలుగు రోజుల సమయం పట్టింది. భారీ ఆయుధ సామగ్రితో ముందుకు కదిలాం. ద్రాస్ సెక్టార్‌కు చేరుకున్నాం. 20 మంది చొప్పున బృందాలుగా పర్వతం పైకి ప్రయాణం. ఏకే 47, లైట్‌మెషిన్ గన్, ఎంఎంజీ, మోర్టార్స్ మా ఆయుధాలు. వారం రోజుల అనంతరం కీలక ప్రాంతమైన టైగర్ హిల్స్‌కు చేరుకున్నాం. ఈ క్రమంలో ఓ అర్ధరాత్రి వేళ మా కదలికలను గమనించిన శత్రుసైన్యం దాడి చేసింది. కుడి చేతికి గుళ్లు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్పృహ కోల్పోయాను. చాలా సేపటి తరువాత కేకలు వేయడంతో.. ప్రథమ చికిత్స అనంతరం హెలికాప్టర్‌లో శ్రీనగర్ బేస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం రోజులు తరువాత.. అక్కడ రద్దీ పెరగడంతో ఢిల్లీలోని ఆర్ఆర్ ఆస్పత్రికి.. అక్కడ్నుంచి విశాఖలో ఉన్న ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణికి తరలించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ కోసం ముంబై ఐఎన్‌హెచ్ అశ్వినికి తరలించారు. 20 రోజుల చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్నాను. 28 రోజుల సిక్ అనంతరం మళ్లీ విధులకు సిద్ధమయ్యాను. ఈ పోరులో రాష్ట్రీయ రైఫిల్ విభాగానికి చెందిన 20 మంది వీరమరణం పొందారు. ఆపరేషన్ విజయ్‌లో ఓపీ స్టార్, ఓపీ విజయ్, ఓపీ రక్షక్, వుండ్ మెడల్స్‌ను ప్రభుత్వం నాకు అందించింది. 2015 జూలైలో సైన్యం నుంచి హవల్దార్‌గా రిటైర్ అయ్యాను.

'నేటి యువతకు దేశరక్షణ విధులు ఎంత అవసరమో అవగాహన కల్పిస్తున్నా. ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇస్తున్నా.'



యుద్ధ వీరుల గౌరవార్థం..



1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై విజయం సాధించిన తరువాత కార్గిల్ యుద్ధ వీరుల గౌరవార్థం ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. యువతకు మన రక్షణ విభాగాల ఆవశ్యకతను తెలియజేయాలి. వారిని త్రివిధ దళాలలో సేవలందించేందుకు సిద్ధమయ్యేలా ప్రోత్సహించాలి.

– పూర్ణ చంద్రరావు కటకం, ప్రెసిడెంట్, శ్రీకాకుళం జిల్లా మాజీ సైనికుల సమాఖ్య.

వానల్లో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్ఈ దైవప్రసాద్



అరసవల్లి: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల పొందూరులో విద్యుత్ తీగ పడి ఒక యువకుడు మృత్యువాత పడగా, లావేరులో ఒక జేఎల్ఎం విద్యుత్ ప్రమాదంలో గాయపడడంతో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో పలు సూచనలు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

- విద్యుత్ సమస్యలకు అలాగే ప్రమాదాల నివారణకు కూడా వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలి. అలాగే స్థానిక విద్యుత్ సర్కిల్ ఆఫీస్ కంట్రోల్ నంబర్ 94906 12633కి డయల్ చేయాలి.
- వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ స్తంభాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో ఉండకూడదు.
- తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదు. అలాగే విద్యుత్ స్తంభాలకు ఉన్న స్టే వైర్లను కూడా తాకే ప్రయత్నాలు చేయవద్దు. నీటిలో పడిన విద్యుత్ తీగలను తాకకూడదు.
- విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తాకే ప్రయత్నం గానీ, నరికే ప్రయత్నాలు చేయవద్దు.
- భవన నిర్మాణాలు చేసేవాళ్లు విద్యుత్ స్తంభాలు, వైర్లకు తగినంత దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ వైర్లను వినియోగించాలి.
- విద్యుత్ వైర్లు వేలాడుతున్న సమాచారాన్ని వెంటనే సమీప విద్యుత్ సిబ్బందికి గానీ 1912కి గానీ చెప్పాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తికి..రక్షించే క్రమంలో నేరుగా చేతులతో తాకరాదు. పొడి కర్ర లేదా విద్యుత్ ప్రవహించని ప్లాస్టిక్ వస్తువుతో షాక్‌కు గురైన వ్యక్తిని తప్పించాలి.
- క్రేన్లు, ఇతర ట్రిప్పర్ల సహాయంతో విద్యుత్ పనులు చేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లను పరికరాలను గమనించి పనిచేయాలి.

అపోలోలో వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స



విలేకరులతో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రి వైద్యులు ఓ వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కార్డియాలజీ విభాగ వైద్య నిపుణులు డాక్టర్ ప్రాణిగ్రహి, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జయదీప్ ఆస్పత్రిలో మంగళవారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన 78 ఏళ్ల భానూజీరావుకు 2015లో వేరే ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. అప్పట్లో ఆయనకు గుండెలో ఎడమ కవాటం మూసుకుపోవడంతో దాన్ని మార్పిడి చేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ ఎడమ కవాటం మూసుకుపోయింది. దీంతో అతని కుటుంబ సభ్యులు ఇటీవల అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు .. ఆయన వయసు ఎక్కువ కావడంతో రెండోసారి అతనికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం ప్రమాదకరమని నిర్ణయానికొచ్చారు. ఈ విషయాన్ని రోగి బంధువులకు వివరించి.. ట్రాన్స్‌కాథెటర్ మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియ ద్వారా చికిత్స చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కుడి కాలు తొడకు రంధ్రం చేసి.. దాని ద్వారా గుండె కుడి కవాటం నుంచి ఎడమ కవాటానికి రంధ్రం చేసినట్లు వైద్యులు వెల్లడించారు. అనంతరం అక్కడ 27.5 మిల్లీమీటర్ల మందం కలిగిన కవాటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ఇది అరుదైన శస్త్ర చికిత్స అని.. ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న వృద్ధుడికి ఈ విధానం ద్వారా శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన గుండె బాగా పని చేస్తోందన్నారు.

జోరుగా వానలు



హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద దిగువకు విడిచిపెట్టిన నీరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నాలుగు రోజులుగా జిల్లాలో జడివాన కురుస్తోంది. జూన్ నెలలో వర్షాలు తక్కువగా ఉన్నా, జూలైలో సగటు కంటే ఎక్కువగా వర్షాలు పడ్డాయి. సుమారుగా అన్ని మండలాల్లో ఈ నెలలో ఇప్పటికి 10 నుంచి 14 రోజుల పాటు వానలు కురిశాయి. సోమవారం జిల్లాలో మొత్తం కలిపి 318 మిల్లీమీటర్ల వర్షం కురవగా, మంగళవారం 1371 మిల్లీమీటర్లు పడింది. జిల్లాలో ఉన్న 30 మండలాల్లో 15 మండలాల్లో సగటు కంటే ఎక్కువగా వర్షం కురవగా, 8 మండలాల్లో సగటు వర్షం పడింది.

ముంపులో తంపర పంట పొలాలు

ఎల్.ఎన్.పేట: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తంపర పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. దబ్బపాడు, రావిచెంద్రి, తురకపేట, సిద్ధాంతం, చిట్టిమండలం, ధనుకువాడ, కోవిలాం, యంబరాం, స్కాట్‌పేట, మోదుగువలస, మిరియాపల్లి, ముంగెన్నపాడు గ్రామాలకు చెందిన సుమారు 500 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎల్.ఎన్.పేట: మోదుగువలస వద్ద నీట మునిగిన పొలాలు

వంశధారకు పెరిగిన వరద

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద మంగళవారం ఉదయానికి స్వల్పంగా వరద నీరు పెరిగింది. క్యాచ్‌మెంట్ ఏరియాతో పాటు గత మూడు రోజులుగా పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టా బ్యారేజీ వద్ద 38.10 మీటర్ల నీటి మట్టం ఉంది. సోమవారం సాయంత్రానికి బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో సుమారు 8వేల క్యూసెక్కులు ఉంది. మంగళవారం ఉదయానికి 10,108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. వచ్చిన నీటిని 12 గేట్లు 20 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి 10,108 క్యూసెక్కులు దిగువకు విడిచిపెట్టినట్లు ఇన్‌చార్జి డీఈ అనిల్‌కుమార్ తెలిపారు. అలాగే కుడి, ఎడమ ప్రధాన కాలువకు నీరు వెళ్లకుండా ఆపినట్లు తెలిపారు.



వర్షం మిల్లీ మీటర్లలో

కొత్తూరు	127.2	రణస్థలం	72.4	పలాస	55.4	హిరమండలం	34.6	మందస	28.2	కవిటి	15.4
ఎచ్చెర్ల	91.8	కోటబొమ్మాళి	70.0	జలుమూరు	48.4	కంచిలి	32.4	వజ్రపుకొత్తూరు	26.2	సోంపేటలో	15.2
శ్రీకాకుళం	84.2	మెళియాపుట్టి	68.8	గారలో	44.4	ఇచ్ఛాపురం	32.2	పొందూరు	26.2	టెక్కలి	14.0
ఎల్ఎన్‌పేట	83.6	సారవకోట	58.4	సంతబొమ్మాళి	42.4	నరసన్నపేట	30.4	ఆమదాదలవస	23.8	జి.సిగడాం	10.8
లావేరు	78.4	సరుబుజ్జిలి	56.0	పోలాకి	38.8	పాతపట్నం	29.4	బూర్జ	23.4	నందిగాం	9.0

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 900 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. 1086 మందికి కాల్ లెటర్స్ పంపించగా, సోమ, మంగళవారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 900 మంది హాజరయ్యారు. క్యాంపస్‌లో 1100 సీట్లు ఉండగా, స్పోర్ట్స్, ఎన్‌సీసీ వంటి ప్రత్యేక కేటగిరీల రిజర్వేషన్ మెరిట్ లిస్టు సిద్ధం కాలే దు. ఈ నేపథ్యంలో 1086 మంది మెరిట్ జాబితా సిద్ధం చేసి, కాల్ లెటర్లు అందజేశారు. రెండు రోజుల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తిచేయగా, 186 మంది గైర్హాజరయ్యారు. ప్రస్తుతం శ్రీకాకుళం క్యాంపస్‌లో 200 సీట్లు మిగిలాయి. త్వరలో మెరిట్ జాబితా ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 1100 మందికి ఆగస్టు మొదటి వారం నాటికి ప్రవేశాలు కల్పించి, రెండో వారంలో క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు. కౌన్సెలింగ్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు పర్యవేక్షించారు. 30 ధ్రువీకరణ పత్రాల పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ చేశారు. విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులకు విశ్రాంతి గదులు కేటాయించారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులకు హాస్టల్స్‌లో వసతి సైతం కల్పించారు.